క్లుప్తంగా

స్వామికి సూర్యనమస్కారాలు



రత్నగిరిపై సూర్యనమస్కారాలు చేస్తున్న పండితులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధానంలో ఆదివారం పర్వదినం సందర్భంగా సూర్యనమస్కారాల కార్యక్రమం జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు సూర్యనమస్కారాల కార్యక్రమాను పండితులు ప్రారంభించారు. సూర్యభగవానుడికి వివిధ అసనాలలో నమస్కారించారు. అనంతరం స్వామివారికి తీర్ధ ప్రసాదాలు సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు.

నిధులు మంజూరు చేయాలి

ప్రత్తిపాడు: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం జిల్లా క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు సంఘ నాయకులు వింజరపు శ్రీధర్, గుండుమళ్ల చిట్టియ్య, సంఘ లీగల్ అడ్వైజర్ సింహాద్రి సూరిబాబుతో కలిసి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధుల విడుదలకై ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతి పత్రం అందజేసినట్టు ధరణాలకోట శ్రీను పేర్కొన్నారు.

విస్తారంగా వర్షాలు



అచ్చంపేట రోడ్డుపై పారుతున్న వరద నీరు

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రోజంతా వర్షం కురవడంతో ఆరుబయటకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, కొంతంగి గ్రామాల్లో చెరువులు నిండికుండలా దర్శనమిస్తున్నాయి. గాలి వానలకు విద్యుత్ అంతరాయం కలగడంతో గృహస్తులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు తడవడం వలన జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గోకవరం: మండలంలోని సింగారమ్మచింత ఆలయం వద్ద పేకాటడుతున్న ఆరుగురు వ్యక్తులను గోకవరం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు ట్రైనీ ఎస్సై ఐ.నాగమణి సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.43 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై వివరించారు.

పబ్లిసిటీ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రాచపల్లి గ్రామా వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్ (బంకు శ్రీను) నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పబ్లిసిటీ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తానన్నారు.

ఉద్యోగాల్లో అన్యాయం

శంఖవరం: పౌరసరఫరా, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అనుబంధంగా రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నియమించిన ఉద్యోగాల్లో తమకు అన్యాయం జరిగిందని జనసేన నాయకుడు గొర్లి నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కాకినాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు జనసేన నాయకులు వినతి పత్రం అందజేశారు. జనసేన నాయకులు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు నాలుగు మండలాల్లో జనసేన కార్యకర్తలకు ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని వాపోయారు. మొత్తం ఉద్యోగాల్లో తమ్ముళ్లనే నియమించారని విమర్శించారు. కూటమిలో ఉండి ఒరిగింది ఏమి లేదని మండిపడ్డారు. నియోజకవర్గ వ్యాప్తంగా 33 కేంద్రాల్లో 99 ఉద్యోగాలు ఉండగా జనసేనకు ఎన్ని కేటాయిస్తారో తెలపాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జనసేన కార్యకర్తలకు అవకాశం కల్పించాలని ఎంపీని కోరారు.

వెలుగుల పండగ

- నేడే దీపావళి
- పెరిగిన బాణసంచా ధరలు
- కళ తప్పిన మార్కెట్లు

గండేపల్లి: దీపావళి పండగ అంటే దీపాలు వెలిగించడం..టపాసులు కాల్చడం..స్వీట్స్ తినడం..ఇది దాదాపు ప్రతి ఇంట్లో జరిగే ఆచారమే. అసలు దీపావళి అంటే ఏమిటి..ఈ పండుగ వెనుక అనేక పురాణ కథలున్నాయి. దీపావళిని వేద కాలం నుంచి మహర్షులు నిర్వహించేవారని పురాణాలు చెబుతున్నాయి. శ్రీ కృష్ణుడు నరకాసురుణ్ణి వధించిన కథ మనకు గుర్తుకు వస్తుంది. రావణాసురుణ్ణి వధించి అయోధ్యకు తిరిగి వచ్చిన రాముడు తమ్ముడైన భరతుణ్ణి కలుసుకున్న రోజు దీపావళి. జూదంలో ఓడి అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తి చేసిన పాండవులు తిరిగి హస్తినాపురానికి తిరిగి వచ్చింది ఈ రోజేనట.

40 దుకాణాల ఏర్పాటు

ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని కిర్లంపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలోని వివిధ గ్రామాల్లో సుమారు 40 టపాసుల దుకాణాలకు అనుమతులిచ్చినట్టు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కె.రాముడు తెలిపారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు.

ఇదీ పరిస్థితి

దీపావళి పండగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాణసంచా దుకాణాలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం యర్రవరం రోడ్డులో లింగవరం కాలనీ సమీపంలో 19, మండల పరిధిలోని జె.అన్నవరంలో ఒకటి, యర్రవరంలో రెండు చొప్పున బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి పెద్దలు వివిధ రకాల మందులు కొనుగోలు చేస్తున్నారు. ఏజెన్సీ ముఖద్వారం కావడంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు మండల కేంద్రం అవ్వడంతో అధిక సంఖ్యలో కొనుగోలుదారులు వచ్చే అవకాశం ఉండటంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు అప్రమత్తమయ్యారు.



ఏలేశ్వరంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

ఆకాశాన్నంటుతున్న ధరలు

దీపావళి సామాన్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎప్పటిలాగే ప్రతిఏటా ధరలు పెరుగుతుండడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. సంప్రదాయ ప్రకారం పండగ జరుపుకోవాల్సి ఉండడం, పిల్లల మాట కాదనలేక నామమాత్రంగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళి సామాన్ల ధరలు ఎప్పటిలాగే సామాన్యులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలకు వద్ద ఎస్సై రామలింగేశ్వరరావు, తహసీల్దార్ కుశరాజు తనిఖీలు చేశారు.

పల్లెల్లో సందడి

బాణసంచా, పూజ సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారులు, అసంఘటిత కార్మికులు, పేదలు తదితరులు తమకు తోచిన రీతిలో దీపావళి జరుపుకోవడానికి పల్లెవాసులు సమాయత్తమయ్యారు. ఒక రోజు ముందుగా శనివారం సాయంత్రం పల్లెల్లో కనిపించే సందడి వాతావరణం ఈ ఏట మందగించిందనే చెప్పవచ్చు. కాగా మహిళలు రంగవల్లులు కొనుగోలు చేస్తున్నారు. ఇంటి ఆవరణ, వరండా, ద్వారాల వద్ద ప్రమిదలతో దీపాలు వెలిగించేందుకు రకరకాల ప్రమిదెలు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కంటే పది శాతం ధరలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. పెట్టుబడులైనా వస్తాయో రావోనని ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



పేలని టపాసులపై వంగి చూడరాదు. బాణసంచాను కిచెన్, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచరాదు. చిన్న పిల్లలను ఎత్తుకుని బాణసంచా కాల్చకూడదు. పెద్ద వారి సహాయం లేకుండా పిల్లలు వారంతట వారే బాణసంచా కాల్చరాదు. అప్పుడే పుట్టిన చిన్నారులు, గర్భిణీలపై బాణసంచా శబ్దాలు ప్రభావం చూపుతాయి. అప్రమత్తంగా ఉండాలి.

కె.రాముడు, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్, ప్రత్తిపాడు



ప్రత్తిపాడులో వెలవెలబోతున్న దుకాణాలు



జెడ్.రాగంపేట హైవేకి సమీపంలో దుకాణాలు

ఆర్టీఐ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'లింగంపల్లి'



ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న లింగంపల్లి శివకుమార్

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ గ్రామానికి చెందిన న్యాయవాది లింగంపల్లి శివకుమార్‌ను వైఎస్సార్ సీపీ ఆర్టీఐ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీలో తనకు సముచిత స్థానం కల్పించినందున పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గపార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబులను ఆదివారం కలిసి శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని టి.రాయవరం గ్రామానికి చెందిన మాజీ లంపకలోవ సొసైటీ డైరెక్టర్ బత్తుల నాగార్జునను పార్టీ అధినేత వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శగా నియమితులయ్యారు. బత్తుల నాగార్జున మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ గిరిబాబు అడుగుజాడల్లో నడుస్తానన్నారు. ఆయన ముద్రగడను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నేతలకు అందని పిలుపులు

- ప్రోటోకాల్ పాటించని అధికారులు
- ఎంపీపీ, జెడ్పీటీసీల ఆవేదన



అత్తులూరి నాగబాబు



ఒమ్మి బిందుమాధవి

జగ్గంపేట: మండలంలోని ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అధికారులు ప్రభుత్వ అధికార కార్యక్రమాలకు ఆహ్వానాలు పంపకుండా అవమానాలకు గురిచేస్తున్నారు. ఏదో ఒక కార్యక్రమానికి పిలవకపోతే పొరపాటు జరిగిందని భావించవచ్చు. కాని వరసగా ఇదే తీరు కొనసాగడంతో కావాలనే పట్టించుకోవటం లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందులోను వైఎస్సార్ సీపీ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులనే ఈ విధంగా అవమానిస్తుండటంతో 'పచ్చ'పాతం చోటు చేసుకుంటోందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అందని ఆహ్వానాలు

జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో ఇటీవల ఆదివారం జ్యోతుల పాపారావు నీటి పారుదల ప్రాజెక్టుకు ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు రూ.3.40 కోట్ల అంచనాతో శంకుస్థాపన చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కమర్షియల్ ట్యాక్స్ అధికారులు చేపట్టిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. తమకు అధికారుల నుంచి ఈ రెండు కార్యక్రమాలకు పిలుపు లేదని, ఎంపీపీ, జెడ్పీటీసీ ధ్రువీకరించారు.

బాల్యం ఒడిలో..



పెద్ద వీరన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1970-75 విద్యార్థుల బ్యాచ్

జగ్గంపేట: వారంతా తాతయ్యలు, అమ్మమ్మలు అయిపోయారు. అడుగులు తడబడు తున్నాయి. అయినా పాత మిత్రులంతా ఒకచోట చేరి అల్లరి చేస్తు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఖుషీ ఖుషీగా గడిపారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలోని ఏలేటి పెద్ద వీరన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1970–75మధ్య విద్యను అభ్యసించిన విద్యార్థుల కలయికకు ఆదివారం కాట్రావులపల్లి వేదిక అయింది. స్థానిక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ కలయికకు వివిధ రాష్ట్రాలలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న సుమారు 75 మంది హాజరయ్యారు. అయితే వచ్చిన వారు అంతా అడుగులు తడబడుతూ, రిటైర్ అయి వున్నవారే. కాకపోతే పదోతరగతి చదివే రోజుల్లో తాము చేసిన అల్లరిని గుర్తుకు చేసుకోవడం, అందరూ వారి మంచిచెడులను, పంచుకుంటు ఎంతో సంతోషంగా గడిపారు. వీరిలో పలువురుని సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. ఇదే బ్యాచ్‌కు సంబంధించిన పలువురు స్వర్గస్తులు కావడంతో వారి మృతికి సమావేశంలో సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల నిర్వాహకులు కాట్రావులపల్లి నీటి సంఘం అధ్యక్షుడు కంటే రామారావు(బుల్లిఅబ్బు) గ్రామ సర్పంచి పిట్టా సుగుణరావు, షేక్ జిన్నా, కొంగర వెంకట నారాయణ, ఏలేటి పద్మ ప్రసాద్, జల్లంగి వీరభద్రరావు, కాట్రావులపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు,

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం (సామర్లకోట): స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు అందజేసి, ఏర్పాట్లను పరిశీలించారు.

కొరియర్, పార్సిల్ కార్యాలయాల తనిఖీ



సామర్లకోటలోని పార్సిల్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సామర్లకోట: దీపావళిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి బాణసంచా రవాణా అయ్యే అవకాశాలు ఉండడంతో జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఆదివారం రాత్రి పోలీసులు కొరియర్, పార్శిల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ మేరకు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనికి పార్సిల్ కార్యాలయంలో పాటు పట్టణ పరిధిలోని వివిధ పార్సిల్ కార్యాలయాలు, కొరియర్ సర్వీసులలోని పార్సిల్స్‌ను పరిశీలించారు.

ప్రజా ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ



పి.అగ్రహారంలో సంతకాలు సేకరిస్తున్న మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, తదితరులు

తొండంగి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టినే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా ఉద్యమంలా కొనసాగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పిలుపు మేరకు పి.అగ్రహారంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, పార్టీ నాయకులు ఐక్యంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించగా గ్రామస్తులు పాల్గొని సంతకాలు చేశారు. కృష్ణాపురం, కొమ్మనాపల్లిలో గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులంతా సమిష్టిగా గ్రామ పార్టీ కార్యాలయంలో మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. ప్రజా ఉద్యమంలా సామన్య ప్రజలు సైతం పాల్గొన్ని చంద్రబాబు తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మద్దతూ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన యమలోకం వీధినాటకం



ధర్మవరంలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో శ్రీగౌరీ శంకరుల 89వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళాకారులు యమలోకం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో యమధర్మరాజుగా చిలకలపల్లి వెంకటరమణ, యమధర్మరాజు–2గా నూలు నూకరాజు, దేవేంద్రుడుగా చిలకలపల్లి శ్రీను, వాయు దేవుడుగా కొల్లు శివ, చిత్రగుప్తుడుగా జువ్వల సతీష్, జూనియర్ ఎన్టీఆర్‌గా కాకి వెంకన్న, రంభగా యడవిల్లి శివ, ఊర్వశిగా పి.పుష్ప, యమబటులుగా సతీష్, చరణ్‌సాయి నటించారు.

కార్తికానికి పీఠికాపురి సన్నద్ధం

- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- 22 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- కుక్కుటేశ్వరుని దర్శన వేళలు పెంపు

పిఠాపురం: నేటి నుంచి పవిత్ర కార్తికమాసం ప్రారంభం కానుంది. శనివారం పాడ్యమి దీపాలు వెలిగించడంతో భక్తులు పూజలకు సిద్ధమవుతున్నారు. ఆలయాల్లో ఆకాశ దీపాలతో కార్తిక పూజలకు శ్రీకారం చుట్టనున్నారు. పరమేశ్వరునికి ప్రీతిపాత్రమైన మాసం కావడంతో పాదగయ పుణ్యక్షేత్రంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లతో పాటు, అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాదగయ పుష్కరిణిలో పాత నీటిని తొలగించి కొత్త నీటిని నింపారు. ఈ పుష్కరిణిలో స్నానాలకే భక్తులు ప్రాధాన్యం ఇస్తుంటారు. మహిళలు ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరించి పుష్కరిణిలో కార్తిక దీపాలను వదులుతుంటారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వీలుగా ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కళ్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. కార్తికం తొలి రోజు నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో నిత్యం స్వామి వారికి లక్షపత్రి పూజ, అభిషేకాలు, మంత్ర పుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఈ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని భక్తులు శివ దీక్షలు స్వీకరిస్తున్నారు.



కార్తిక ఉత్సవాలకు సిద్ధమైన పాదగయ క్షేత్రం

దర్శన వేళల పెంపు

కార్తికమాస పూజల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం కుక్కుటేశ్వరస్వామి దర్శన వేళలను పెంచినట్లు అధికారులు తెలిపారు. ప్రతి రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి వారి ఆలయం తెరచి ఉంచనున్నారు. భక్తుల సంఖ్యను రద్దీని బట్టి మరింత సమయం తెరచి ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రైతన్న దిగాలు

- కష్టాల్లో ఖరీఫ్ రైతులు
- తెగుళ్లతో వరిపంట నాశనం
- ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన



గోకవరం: ప్రతికూల వాతావరణంతో గతేడాది వరి సాగులో నష్టాలు ఎదుర్కొన్న రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగును ఆశాజనకంగా ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రైతులకు ప్రోత్సాహకరంగా ఉండటంతో మెట్టలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. గోకవరం మండలంలో 4,200 హెక్టార్లలో ఉండే వరి విస్తీర్ణం 5,200 హెక్టార్లకు పెరిగింది. ఈ ఏడాది రైతులు 5,150 హెక్టార్లలో వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండగా పైరుకు తెగుళ్ల ఆశించాయి. దీనితో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కరుణించని వరుణదేవుడు

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురవడంతో చెరువుల్లో నీటి నిల్వలు బాగా సమృద్ధిగా ఉన్నాయి. మండలంలోని గోకవరం, కొత్తపల్లి, తంటికొండ, కామరాజుపేట, రంపయర్రంపాలెం, గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, తిరుమలాయపాలెం, గంగంపాలెం, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, కృష్ణునిపాలెం తదితర గ్రామాల్లో రైతులు వరిసాగు అధికంగా చేపట్టారు.

ఎండు తెగులు విజృంభణ

ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువల ద్వారా నీరు రావడంతో గోకవరం, కృష్ణునిపాలెం, తంటికొండ, కొత్తపల్లి గ్రామాల్లో పంట పొలాలకు నీరు సమృద్ధిగా అందుతుంది. పుష్కర కాలువ, సూరంపాలెం కాలువల నుంచి మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలకు నీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం వరి పంటలో పసుపు ఆకు పచ్చ, ఎండు తెగులు కనిపిస్తుంది. ఆకులు అంచులు పసుపు రంగులో మారిపోయి పొలం అంత ఎర్రగ్రా కనిపిస్తోంది. మెట్ట ప్రాంతం జగ్గంపేట నియోజకవర్గంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. ఈ నెల 23న బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో తెగుళ్ల మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పొట్టదశలో ఉన్న వరి



తెగులు ఆశించిన వరి పొలం

సస్యరక్షణ చర్యలు పాటించాలి



వరిలో పసుపు ఆకు పచ్చ, ఎండు తెగులు కనిపిస్తుంది. దీన్ని బ్యాక్టీరియా ఎండు తెగులని అంటారు. ఇది నీడ ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా వస్తుంది. దీని నివారణకు పొలంలో ఉన్న నీరు తీసివేసి నీరుని మార్చాలి. పొటాష్ ఎరువులు ఎకరానికి 15–20 కిలోలు వేసుకోవాలి. తెగులు ఉధృతి ఎక్కువ ఉన్న పొలాల్లో ప్లాంటమైసిన్, స్ట్రెప్టోమైసిన్ అనే బ్యాక్టీరియా నాశినిలు వారానికి రెండుసార్లు స్ప్రే చేసుకోవాలి. ఇవి అందుబాటులో లేకపోతే బ్లైటాక్స్ లేదా బ్యారిక్స్ వంటి బ్యాక్టీరియా నాశిని మందులు మిగతా పంటకు సోకకుండా స్ప్రే చేసుకోవచ్చు. నీటి యాజమాన్యం నత్రజని యాజమాన్యం ద్వారా మాత్రమే బ్యాక్టీరియా ఎండు తెగులు నివారించుకోవచ్చు. రైతులు కొద్ది పాటి సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది.

–రాజేశ్వరి, మండల వ్యవసాయశాఖ అధికారి, గోకవరం మండలం

అయ్యప్ప స్వామికి లక్షబిల్వార్చన

తొండంగి: మండలంలోని రావికంపాడు సిద్ధి వినాయక ఆలయం వద్ద ఈ నెల 22వ తేదీన బుధవారం అయ్యప్ప స్వామికి లక్షబిల్వార్చన, పడిపూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వినాయకుని ఆలయ ప్రాంగణం వద్ద గొల్లప్రోలుకు చెందిన గురుస్వామి తాటిపర్తి పంతులు పర్యవేక్షణలో సాయంత్రం ఏడు గంటలకు అయ్యప్ప లక్షబిల్వార్చన, పడిపూడ ప్రారంభమవుతందని పరిసర గ్రామాల అయ్యప్పదీక్షాపరులు, శివదీక్షాపరులు కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని కోరారు.

జీఓ 11 వెనక్కు తీసుకోవాలి

సామర్లకోట: సచివాలయ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీఓ 11ను వెంటనే వెనక్కు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వేట్లపాలెం సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు వీరబల్ల లోవరాజు, మారిశెట్టి రమణ ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 40 రోజులుగా నిరసనలు తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధుల పేరుతో కొంతమందిని పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, సర్వే విధులు తప్పనిసరిగా చేయాలని జీఓ తీసుకురావడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యకం చేశారు. సర్వేల విముక్తి కోసం తాము పోరాడుతుంటే దానిపై జీఓ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి మాత్రమే ఒక సర్వే ఉంటుందని హామీ ఇచ్చి కూడా ప్రభుత్వం అప్పగించిన పనులన్నీ కొత్త జీఓ 11లో జోడించి తమను కించపరుస్తున్నారని తెలిపారు.